**Eenadu**

# ఐదో జోన్లో పెరిగిన పోస్టులు

- టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో 'గ్రూప్‌-2' సమగ్ర వివరాలు

ఈనాడు, హైదరాబాద్‌: గ్రూప్‌-2 పరీక్షకు సంబంధించిన పూర్తి నియమ నిబంధనలను తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. అర్హతలు, రోస్టర్‌ పాయింట్లతోపాటు అన్ని వివరాలూ అందులో ఉన్నాయి. తొలుత విడుదల చేసిన నోటిఫికేషన్‌తో పోలిస్తే.. ఐదో జోన్లో (ఆదిలాబాద్‌, కరీంనగర్‌, వరంగల్‌, ఖమ్మం) ఉద్యోగాల సంఖ్య గణనీయంగా పెరిగింది. తొలి ప్రకటనలో ఐదో జోన్లో కేవలం 90 పోస్టులు మాత్రమే రాగా... ఈసారి 199 అదనంగా వచ్చాయి. ఐదో జోన్లో మొత్తం పోస్టులు 289. కో ఆపరేటివ్‌ సొసైటీల్లో అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ పోస్టులు ఆరో జోన్‌ కంటే (30) ఐదో జోన్‌లో (32) ఎక్కువ ఉన్నాయి. మిగిలిన అన్ని పోస్టుల్లో ఆరో జోన్‌లోనే ఎక్కువ.

- మొత్తం 1032 పోస్టుల్లో మహిళలకు 33% రిజర్వేషన్‌ కింద మొత్తం 353 పోస్టులు అందుబాటులో ఉన్నాయి.
- రాత పరీక్షలో కనీస అర్హత మార్కులు- ఓసీలకైతే 40%, బీసీలకు 35%; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకైతే 30%. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల కనీస అర్హత మార్కులను అవసరమైతే మార్చే విచక్షణాధికారం కమిషన్‌కు ఉంటుంది.
- రాత పరీక్ష అనంతరం 1:2 నిష్పత్తిలో అన్ని నిబంధనలను దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులను మౌఖిక పరీక్షకు పిలుస్తారు.
- రాత పరీక్షలో అన్ని పేపర్లకూ హాజరై రాసిన వారే ఉద్యోగానికి అర్హులవుతారు. ఏ ఒక్క పేపర్‌కు గైర్హాజరైనా వారిని పరిగణనలోకి తీసుకోరు.
- మున్సిపల్‌ కమిషనర్‌ గ్రేడ్‌-3 పోస్టులను మల్టీ జోనల్‌గా (రెండు జోన్లకూ వర్తిస్తాయి) పేర్కొన్నారు.
- సచివాలయంలో అసిస్టెంట్‌ సెక్షన్‌ ఆఫీసర్‌ పోస్టులకు జోనల్‌ పద్ధతి వర్తించదు. అవి రాష్ట్రస్థాయి పోస్టులుగా పేర్కొన్నారు.
- దేవాదాయ శాఖలో ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ గ్రేడ్‌-1 పోస్టుకు ఎంపికయ్యేవారు హిందూ మతంపట్ల విశ్వాసం వ్యక్తంజేయాల్సి ఉంటుందని నిబంధన ఉంది.
- సచివాలయంలో ఏఎస్‌ఓ పోస్టులకు కంప్యూటర్‌ పరిజ్ఞాన పరీక్షను ఎంపిక ప్రక్రియలో ఏడో దశలో నిర్వహిస్తారు. ఇది అర్హత పరీక్ష మాత్రమే.
- సిటీకేడర్‌ను ప్రత్యేకంగా చూపించని చోట హైదరాబాద్‌ సిటీకి చెందినవారు ఆరో జోన్‌ కిందికి వస్తారు.
- పూర్తి వివరాల కోసం టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ tspsc.gov.in చూడవచ్చు.

గమనిక: గ్రూప్‌-2కు మౌఖిక పరీక్షలుండవనే అర్థంలో శుక్రవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. కానీ, గ్రూప్‌-2లో 75 మార్కులకు మౌఖిక పరీక్ష ఉంటుంది. పాఠకులు గమనించగలరు.